క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చెరుకుపల్లి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని పొన్నపల్లి అగ్రహారం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల అందించిన వివరాలు.. గుళ్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన గున్నం రాజు, అంకమ్మరావు, పోతురాజు ద్విచక్ర వాహనంపై చెరుకుపల్లి నుంచి కనగాలవైపు వెళ్తున్నారు. పొన్నపల్లి అగ్రహారం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో ముగ్గురు గాయపడడంతో 108లో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ముగ్గురిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

రేపల్లె రూరల్: సీఎం సహాయ నిధి చెక్కులను ఏడుగురికి శుక్రవారం పంపిణీ చేశారు. రూ.15.26 లక్షలు విలువైన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అనగాని శివప్రసాద్, పంతాని మురళీధర రావు, జీపీ రామారావు, పాల్గొన్నారు.

టీటీడీలో అవినీతిపై చర్యలు తీసుకోవాలి

రేపల్లె రూరల్: తిరుపతి అడుగడుగునా అవినీతిమయంగా మారిపోయిందని, స్వాక్షాత్తూ టీడీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వ పాలనలో టీటీడీ అవినీతికి అద్దం పడుతోందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ మెంబర్, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. టీడీపీ అధికార ప్రతినిధి చెందు వేణుగోపాలరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేస్తూ ఆలయంలో అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చారన్నారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి రూ.25 వేలు, ప్రొటోకాల్ దర్శనానికి రూ.50 వేలు, ఉద్యోగుల దర్శనానికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వరకు భక్తుల నుంచి అక్రమంగా వసూలుకు పాల్పడుతున్నారని ఆరోపించినట్లు గుర్తు చేశారు. ఆధ్యాత్మిక కేంద్రాన్ని లాభాల కేంద్రంగా మార్చేశారని ఆరోపించారు. తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కిక్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఐలవరం విద్యార్థులు



భట్టిప్రోలు(కొల్లూరు): రాష్ట్ర స్థాయి కిక్ బాల్ పోటీలకు మండలంలోని ఐలవరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహన్‌రావు తెలిపారు. ఈనెల 11న ఐలవరం పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన 9వ తరగతి విద్యార్థు ఎం. రోహిత్‌నాగసాయిమణికంఠ, పి.పవన్‌కుమార్ రెడ్డి ఎంపిక కాగా ప్రకాశం జిల్లా పొదిలిలో నిర్వహించనున్న పోటీలలో జిల్లా జట్టు తరఫున పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల వ్యాయమోపాధ్యాయుడు తుమ్మా శ్రీనివాస రెడ్డి, క్రీడాకారులను గ్రామ సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు అభినందించారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలి

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను కార్యదర్శులు విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ సచివాలయాలను పరిశుభ్రం చేసుకోవాల్సి ఉందని తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం నుంచి కర్లపాలెం ఐలాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయిస్తామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు.

డీఎస్‌వో షరీఫ్ మృతికి సంతాపం



తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సయ్యద్ షరీఫ్ మృతి చెందడం బాధాకరమని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. షరీఫ్ సంతాప సభను మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో బాధ్యతగా ఆయన వ్యవహరించే వారని గుర్తు చేశారు. ఆకస్మాత్తుగా మృతి చెందడం బాధకరమన్నారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి కె.హెలెన్ నిర్మల, మేనేజర్ దేవసేన, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పైసా లేకుండా ఫైల్ కదలదు..

- అవినీతికి కేరాఫ్ తహసీల్దార్ కార్యాలయం
- అవస్థలు పడుతున్న ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం

వేమూరు: అవినీతి రాజ్యమేలుతోంది. పేదలను జలగల్లా పిండేస్తున్నారు. పైసా లేనిదే ఫైల్ కదలే పరిస్థితి కనిపించడం లేదు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి. అవినీతికి కేరాఫ్ తహసీల్దార్ కార్యాలయం మారింది. స్వయంగా కార్యాలయ ప్రధాన అధికారే పైసలు కోసం డిమాండ్ చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఓ టీడీపీ నాయకుడు పంచాయితీ చేసినట్లు సమాచారం.

పాడి పరిశ్రమ షెడ్‌ల విషయంలో...

మండల కేంద్రంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పాడి పరిశ్రమ షెడ్ ఏర్పాటు చేశారు. షెడ్ పోరంబాకు భూమిలో ఉంది. పాడి పరిశ్రమ షెడ్ నిర్మించుకున్న రైతు వద్ద నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. వీఆర్వో పలుసార్లు రైతు దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో రైతు గ్రామంలోని ప్రముఖ టీడీపీ నాయకుడి దృష్టికి తీసుకొని వెళ్లాడు. కాగా సదరు టీడీపీ నాయకుడు తహసీల్దార్‌కు ఫోన్ చేసి నిలదీశాడు.

నేరుగా వీఆర్వోల సమావేశంలో...

ఇదిలా ఉండగా డిసెంబర్ 31వ తేదీనవీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి వీఆర్వో రూ.10 వేలు ఇవ్వాలని ఆ ప్రధాన అధికారి డిమాండ్ చేయడంతో కొంత మంది వీఆర్వో లు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ పంచాయితీ కూడా స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. గ్రామంలో వీఆర్వోకు సంబంధం లేకుండా కొంత మంది ఏజెంట్‌లను ఏర్పాటు చేసుకొని కొన్ని ఫైల్స్ పరిష్కారం అవుతున్నాయని వీఆర్వోలు వాపోతున్నారు.

వేమూరు మండలంలోని జంపని గ్రామంలో బెయిల్‌కు అవసరమైన డ్యాకుమెంట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్తే డబ్బులు ఇస్తే సంతకం చేస్తానని ఆ అధికారి తేల్చి చెప్పాడు. దీంతో వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ, తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి గొడవ వేశారు. దీంతో తహసీల్దార్ సంతకం చేసినట్లు బాధితుడుతు చెప్పాడు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేయడంతో ప్రజలు నానా బాధలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు రాకుండా లంచం లేకుండా పనులు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నారు.

పనులు చేయడం లేదు



తహసీల్దార్ కార్యాలయంలో లంచం లేకుండా పనులు చేయడం లేదు. ప్రతి పనికి లంచడం డిమాండ్ చేస్తున్నారు. బెయిల్ కోసం పొలం కాగితాలపై సంతకం పెట్టేందుకు లంచం డిమాండ్ చేశారు.

– టి.అంకమ్మరావు, మాజీ ఎంపీటీసీ, జంపని

రహదారి భద్రతా నియమాలను పాటించాలి


మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు

తెనాలిరూరల్: రహదారి భద్రతపై రోడ్డు రవాణా శాఖ తెనాలి అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సును శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించారు. తెనాలి, కొల్లిపర, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను పరిధిలోని వాహనదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రహదారి నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. 18 ఏళ్ల లోపు మైనర్లు వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని, వాహనం నడిపినందుకు అపరాధ రుసుము వేస్తామని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని స్పష్టం చేశారు అలాగే ఆటోలకి ఆటో పర్మిట్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ వంటి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, అవి కూడా ఆటోలోనే ఉంచుకోవాలని చెప్పారు. ఆటో డ్రైవర్లు తమ ఆటో వెనుక డోర్ తీసి ప్రయాణికుల్ని ఎక్కించినా, డ్రైవర్ల పక్కన కూర్చోబెట్టుకున్న కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే ఎక్కువ మంది సెకండ్ హ్యాండ్ ఆటోలు కొనుగోలు చేసి వాడుతున్నారని అటువంటి ఆటోల్లో పర్మిట్ ఉండటం లేదని, పర్మిట్ లేని వాహనాలను కొనుగోలు చేసి నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. సరుకులు రవాణా చేసే ఆటోలలో ప్యాసింజర్‌లను ఎక్కించుకుంటున్నారని అది నేరమన్నారు. అటువంటి వాహనాలను సీజ్ చేసి అపరాధ రుసుము విధించడం జరుగుతుందని ఎంవీఐ రాఘవరావు తెలియజేశారు.

డ్రెయిన్ పూడికతీత



బాపట్ల: బాపట్ల పట్టణంలోని మురుగుకాలువలో పూడికతీత కార్యక్రమం చేపట్టామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. చిన్న, చిన్నకాలువల నుంచి పెద్దకాలువలోకి మురుగు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక సిల్ట్ తీసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. కాలువలో చెత్తాచెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కొనుగోళ్ల బకాయిల విడుదలపై హర్షం

తెనాలి: గ్రంథాలయ సంస్థలు 2021–22 సంవత్సరానికి కొనుగోలు చేసిన పుస్తకాలకు సంబంధించిన బకాయిల విడుదలకు అరసం, రచయితలు, ప్రచురణకర్తల విజ్ఞప్తులకు ప్రభుత్వం స్పందించటంపై అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కడప జిల్లాల్లోని బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందనీ, ఇంకా అనంతపురం, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో గ్రంథాలయ సంస్థలు కొనుగోలు చేసిన పుస్తకాలకు బకాయిల చెల్లింపునకు సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

ప్రకృతి సాగు మొక్కజొన్న పైరు పరిశీలన


పైరును పరిశీలిస్తున్న అధికారులు

తెనాలి: ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి, వనరుల కేంద్రం, గుంటూరు అధికారులు శుక్రవారం రూరల్ మండల గ్రామం ఎరుకలపూడిని సందర్శించారు. ఆ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొక్కజొన్న పైరుకు బెడదగాతయారైన కత్తెర పురుగు నివారణకు సంబంధిత రైతు విజయ లక్ష్మీ అవలంభిస్తున్న మొక్క సుడుల్లో బురద మట్టి అజ్ఞాస్త్రం ఉపయోగించే పద్ధతిని ప్రత్యక్షంగా చూశారు. అలాగే, రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తూ సంప్రదాయంగా సాగు చేస్తున్న మొక్కజొన్న పొలాలను కూడా సందర్శించారు. ఆయా పొలాల్లో మొక్కల ఎదుగుదల, వేరు వ్యవస్థ, కత్తెర పురుగు ఆశించిన మొక్కలను పరిశీలించారు. తెనాలి మండల గ్రామ వ్యవసాయ సహాయకులు కూడా క్షేత్ర సందర్శనకు హాజరై ఆయా పద్ధతులను తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులకు ఎలా ఉపయోగపడుతున్నాయి అనేది గమనించి, రైతులందరికీ తెలియజేయాలని అధికారులు వ్యవసాయ సహాయకులకు సూచించారు. అంతేకాకుండా ఎన్‌పీఎస్ఎస్, ఏపీఎస్ఎస్ యాప్‌లపై మండల వ్యవసాయ సహాయకులకు శిక్షణనిచ్చారు. డీఆర్‌సీ అధికారులు సునీత, శివకుమారి, రాజవంశీ, తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌సాగర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


మొక్కజొన్నలో కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలి

ఏఓ కిరణ్మయి



చినలింగాయపాలెం(కాకుమాను): రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు పంటపై కత్తెర పురుగు ఆశించకుండా అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం, కొండబాలబవారి పాలెం గ్రామాలలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్నపై అక్కడక్కడ కత్తెర పురుగు కనిపిస్తున్నట్లు ఆమె తెలిపారు. పంటపై ఈ రకం పురుగు ఆశించిన వెంటనే ఉదయాన్నే మంచు కురిసే సమయంలో ఎకరాకు 150 మిల్లీ లీటర్ల ఇమామెట్టిన్ బెంజోడ్, 150 మిల్లీ లీటర్ల నవల్యూరాన్ రెండు మందులను నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. రైతులందరు తప్పనిసరిగా పంట నమోదు, ఈ కేవైసీ చేయించుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచానికే పరిమితమైన వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



కాకుమాను: మంచానికే పరిమితమైన వారి ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.లావణ్య అన్నారు. జిల్లా వైద్య శాఖ ఆదేశాల మేరకు పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మంచానికే పరిమితమైన వారి ఆరోగ్య విషయాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 40 మంది మంచానికే పరిమితమైన వారు ఉన్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు వారి ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సంబంధిత ఏఎన్‌ఎంకు గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు వస్తే ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు, విజయవాడ జిల్లా ఆరోగ్య కేంద్రాల ప్రొఫెసర్లు డాక్టర్ బి.ఎస్.రవితేజ, డాక్టర్ ఎన్.సింధూర, సీహెచ్‌ఓ ప్రసాద స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి

పొన్నూరు: మండలంలోని దండమూడి, మునిపల్లె గ్రామాలలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, వరి పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ డేగల వెంకట్రామయ్య మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్నలో కాండం తొలుచు పురుగు సస్యరక్షణ చర్యలు వివరించారు. మినుము, పెసర పంటలలో ముఖ్యమైన పోషకాలు పిచికారీ రూపంలో అందించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలియజేశారు. రబీ సీజన్‌లో వేసిన అన్ని పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని, ఈ కేవైసీ కూడా తప్పనిసరిగా చేయాలన్నారు.

నూతన భవనం ప్రారంభం నేడు



తెనాలి: రూరల్ మండల గ్రామం నందివెలుగులో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకే ఏర్పాటయే ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరవుతారు. గ్రామానికి చెందిన మేము సైతం టీం, గ్రామసర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు.

రైల్లో నుంచి జారి పడి యువకుడు మృతి

తెనాలిరూరల్: రైల్లో నుంచి జారి పడి యువకుడు మృతి చెందిన ఘటన తెనాలి రైల్వే స్టేషను సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ తెనాలి రైల్వే స్టేషనులోకి వస్తుండగా అందులో నుంచి సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటాద్రి తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి



తెనాలిఅర్బన్: వంగవీటి రాధా–రంగా స్మారక కాపు యువజన సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని శుక్రవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంబీ బీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రావూరి జయంద్రకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే సీఏలో ప్రతిభ చూపుతున్న జక్కా ఆకాష్, ఆదిత్యలను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్, దైవాల సుబ్రమణేశ్వర రావు, పొన్నం విజయ్ కుమార్, డాక్టర్ కమ్మెల హరీష్, దాసరి సాంబశివరావు, కమ్మెల రజిని, లింగినేని శంకర్, దంతాల ప్రేమ్‌కుమార్, దేవిరెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్స్ వెటర్నరీ ఫెడరేషన్ సభ్యులు

రేపల్లె రూరల్: పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం పశు వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశుసంవర్ధక శాఖ రేపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్. నాంచారయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్(ఏపీఎన్‌జీయుఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని పట్టణంలోని పశువైద్యశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పశుపోషకులు తమ పశువుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, పశువులలో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే తమ పరిధిలోని పశు వైద్యుల వద్దకు తీసుకెళ్లి సకాలంలో వైద్యం అందేలా సహకరించాలని కోరారు. పశువులకు నిర్ణీత కాల వ్యవధిలో అవసరమైన టీకాలు వేయిస్తూ వాటి ఆరోగ్య పరిరక్షకులు కావాలని కోరారు. పశు వైద్యులు తమ వైద్యశాలలో అన్ని వేళలా అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో పశువుల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించాలని కోరారు. క్యాలెండర్‌లను అధికారులతో పశుపోషకులకు అందించబడునని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.విజయసారథి, సిబ్బంది ఆలీ, పి.వెంకటేశ్వరరావు, వినోద్‌కుమార్, కరిష్మా, గోపి పాల్గొన్నారు.

పూరిల్లు, గొడ్ల చావిడి దగ్ధం

రెండు పశువుల మృతి


అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న గొడ్లచావిడి

చెరుకుపల్లి: విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు, గొడ్లచావిడి దగ్ధం కాగా రెండు పశువులు మృతి చెందిన ఘటన మండలంలోని గుళ్లపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. గుళ్లపల్లికి చెందిన అల్లపర్తి పుల్లారెడ్డికి చెందిన పూరింట్లో షార్ట్ సర్క్యూట్ కావ్వటంతో పూరిల్లు, గొడ్లచావిడి, గడ్డివాములకు నిప్పు అంటుకుంది. ఇల్లుతో పాటు ఇంటిలోని సామగ్రి పూర్తిగా దగ్ధమవ్వగా బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. అదే విధంగా ఇంటికి పక్కనే ఉన్న గొడ్లచావిడికి, గడ్డివామికి మంటలు వ్యాప్తించి పూర్తిగా దగ్ధమయ్యాయి. గొడ్లచావిడిలో ఉన్న రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. ప్రమాదంలో రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు.

స్వచ్ఛందంగా.. నిర్మలంగా.. విదేశీయుల ఆటపాట

- సంప్రదాయ చీరె, షేర్వాణీలతో..
- విద్యార్థులకు మూడువారాల స్వచ్ఛంద బోధన
- చివరిరోజున సందడితో వీడ్కోలు తీసుకున్న బృందం



ప్రొఫెసర్ విద్యాసాగర్, ప్రిన్సిపాల్ హేమలతతో పాటు విదేశీ ఉపాధ్యాయులు/ విద్యార్థులు

తెనాలి: పట్టణ ఆర్‌ఆర్ నగర్‌లోని ఓ స్వచ్ఛంద పాఠశాల...పేరు దయామణి జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూలు. అనుబంధంగా హాస్టలు, ప్రార్థనామందిరం ఉన్నాయి. అక్కడి ఆవరణలో శుక్రవారం సాయంత్రం విదేశీ యువతీ యువకులు సందడి చేశారు. భారతీయ సంప్రదాయ దుస్తులను ధరించారు. అక్కడి పేదింటి పిల్లలు, టీచర్లతో కలిసి ఆడిపాడారు. మళ్లీ ఏడాదికి మరోసారి కలుద్దామంటూ వీడ్కోలు తీసుకున్నారు. నిజానికి వారంతా ఆస్ట్రేలియా దేశంలోని సిడ్నీ నగరంలోని ఉపాధ్యాయులు. గత మూడువారాల క్రితం తెనాలి వచ్చారు. విధివంచిత బాలలు ఎక్కువగా ఉండే ఆ పాఠశాలలో బోధనోపకరణాలతో చిన్నారులకు చిన్న చిన్న పాఠాలు నేర్పించారు. ప్రాథమిక ఇంగ్లిష్‌ను బోధించారు. ఖాళీ సమయాల్లో వారితో ఆటపాటతో గడిపారు. ఆనందంతో తుళ్లిపడ్డారు. అనాథలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు లేని పేదింటి పిల్లల కోసం నడుస్తున్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల అది. వీరికి ఏటా కొన్ని వారాలు విదేశీయులు పాఠాలు చెబుతుంటారు. పట్టణానికి చెందిన ప్రవాస భారతీయుడు, ఆస్ట్రేలియాలోని నోట్రె డేమ్ యూనివర్సిటీకి సిడ్నీలో గల స్కూల్ ఆఫ్ లా అండ్ బిజినెస్‌లో ఆర్గనైజేషనల్ బిహేవియర్ శాఖాధిపతి డాక్టర్ అత్తోట విద్యాసాగర్ నేతృత్వంలో ఇక్కడి పాఠశాల నడుస్తోంది. ఆస్ట్రేలియాలోని మరో ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ సియాన్ కీర్నే సహకారంతో 2015 నుంచి ఈ పాఠశాలను నడుపుతున్నారు. ప్రైవేటు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలకు దీటుగా ఆస్ట్రేలియాలోని నాణ్యమైన విద్యాబోధనతో స్కూలు నడవాలనేది డాక్టర్ విద్యాసాగర్ ఆశయం. అందుకు తగినట్టుగా ఇక్కడి ఉపాధ్యాయులకు 'జూమ్' తరగతుల్లో శిక్షణనిస్తున్నారు. ఏటా శీతాకాలం మూడువారాలపాటు అక్కడి యువ ఉపాధ్యాయినులు, కాలేజీ విద్యార్థినులు ఇక్కడి చిన్నారులకు బోధనోపకరణాలు, ఆటపాటలతో పాఠాలను నేర్పుతున్నారు. ఈ క్రమంలో డాక్టర్ విద్యాసాగర్‌తోపాటు 17 మంది ఆస్ట్రేలియన్లు ప్రస్తుత శీతాకాలంలో ఇక్కడికి వచ్చారు. వీరిలో కొందరు ప్రీస్కూల్ ఉపాధ్యాయినులు.'పేదపిల్లలకు ఎవరైతే సాయం చేస్తారో... వారు దేవుడికి సేవ చేసినట్టు' అన్న బైబిల్ వాక్యాన్ని విశ్వసించిన డాక్టర్ విద్యాసాగర్ తన సంపాదనలో కొంత మొత్తాన్ని వెచ్చించి చేస్తున్న స్వచ్ఛంద సేవలో వీరంతా భాగస్వాములయ్యారు. వీరిలో ఇక్కడికి రెండు మూడు పర్యాయాలు వచ్చిన వారున్నారు. అనాథలైన ఆ చిన్నారులతో గడుపుతూ వారి ముఖాల్లో ఏసును చూస్తున్నంత అనుభూతిని చెందుతున్నామని సంతోషంతో చెబుతున్నారు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం/ ఉన్నత చదువుల్లో ఉన్న వీరంతా ఎక్కడో దేశంకాని దేశంలో ఓ చిన్న పట్టణంలోని అనాథల సేవలో కొంతకాలమైనా గడపటం గొప్ప విశేషం. తీరిక సమయాల్లో ఇక్కడి పరిసరాల్లోని పంటలను, పరిశ్రమలను సందర్శిస్తూ ఆ విశేషాలను తెలుసుకుంటున్నారు.

20 నుంచి పశుఆరోగ్య శిబిరాలు

తెనాలి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 20వ తేదీ నుంచి పశుసంవర్ధకశాఖ పెదరావూరు (తెనాలి డివిజన్) డివిజను పరిధిలో పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆ శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి వెల్లడించారు. ఈనెల 31వ తేదీవరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. శుక్రవారం తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. ప్రతి మండలంలోనూ పశు వైద్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పాటై, ప్రతి గ్రామానికి వెళ్లి పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తారని చెప్పారు. ఆయా శిబిరాల్లో పశువులకు సీపాక్స్, గోట్‌పాక్స్, కోళ్లకు పౌల్ట్రీ వాక్సినేషన్లు చేస్తారు. అంతేకాకుండా ఆవులు, ఎద్దులు, గేదెలకు నట్టల నివారణ మందును తాగిస్తారు. గొర్రెలు, మేకలకు కూడా నట్టల నివారణ మందును ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఎదకు రాని పశువులకు, ఆరోగ్య పరిస్థితి బాగోలేని పశువులను పరీక్షించి తగిన వైద్యచికిత్సలను అందిస్తారని వివరించారు. రాష్ట్రం మొత్తం అదేరోజున ఆరంభమయ్యే శిబిరాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు చెప్పారు. రైతు సోదరులు, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పద్మావతి కోరారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



తెనాలిఅర్బన్: దోమకాటుతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో 10వ వార్డులో శుక్రవారం వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వ్యాప్తి నియంత్రణకు అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఇంటి ఆవరణలో ఉన్న టైర్లు, పాత వస్తువుల్లో ఉన్న నీటిని పారబోయాలని సూచించారు. అలాగే దోమలు కుట్టకుండా దోమ తెరలు, పూర్తి వస్త్రధారణతో ఉండాలని చెప్పారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.